## కథ

– సి.ఎస్. చంద్రశేఖర్

# ఆహ్వాన పత్రిక

''ఒరేయ్ బాలూ ప్రకాశం మామయ్య శుభలేఖ పంపించారు. శ్రావణికి ఈ నెల ఇరవై ఆరున బెంగుళూరులో పెళ్ళట. నువ్వు తప్పకుండా వెళ్లి రావాలి'' అంది శాంతమ్మ కొడుకుతో.

''మరి నీ మేనకోడలి పెళ్లికి నువ్వు రావా?''

''నాకీ మధ్య ఒంట్లో శక్తి ఉండటం లేదురా. ఆ సిటీలో అంతంత దూరం బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణం చెయ్య లేను. నువ్వు మాత్రం తప్పకుండా పెళ్లికి వెళ్లిరా.''

''చూద్దాంలే అమ్మా. ఇంకా రెండు వారాల సమయముందిగా'' అన్నాడు. నిజానికి బాలుకు పెళ్లికి వెళ్లాలనే ఉంది. అందుకు కారణం సుప్రజ.

సుప్రజ ప్రకాశం మూడో కుమార్తె.

★ ★ ★

ఆరు నెలల క్రితం ప్రకాశం తన కుటుంబంతో చిత్తూరు వచ్చాడు.

తమ ఇంటి ముందు కారు ఆగడం గమనించి బాలు బయటకు వచ్చి చూశారు. ఎవరో కొత్త మనుషులు తమ ఇంటివైపే వస్తుండటంతో ''ఎవరు కావాలండీ?'' అని అడిగాడు.

''శాంతమ్మ ఇల్లు ఇదేనా?'' ప్రకాశం అడిగాడు.

అవునన్నట్టు తలూపాడు బాలు.

''నువ్వు బాలువి కదూ?''

''అవును'' ఆశ్చర్యంగా అన్నాడు బాలు.

''నేను నీ మేనమామ ప్రకాశాన్ని. మమ్మల్ని ఇంట్లోకి రానిస్తావా లేదా?'' నవ్వుతూ అన్నాడు ప్రకాశం.

''సారీ. రండి రండి'' అంటూ ఇంట్లోకి ఆహ్వానించాడు బాలు. ఇంట్లో రెండు కుర్చీలే ఉండటంతో మంచం వాల్చాడు. వాళ్లు కూర్చున్నాక మంచినీళ్లు ఇస్తూ ''అమ్మ గుడికెళ్లింది. వచ్చేస్తుంది'' అన్నాడు.

''ఏం చేస్తున్నావు నువ్వు?'' ప్రకాశం భార్య మాలతి అడిగింది.

''బి.ఎస్.సి. ఫైనల్ ఇయర్.''

''వెరీ గుడ్. వీళ్లు మా అమ్మాయిలు. పెద్దమ్మాయి శ్రావణి ఎం.సి.ఎ. చేస్తోంది. తర్వాత భార్గవి. బి.డి.ఎస్. చేస్తోంది. సుప్రజ బి.టెక్ మొదటి సంవత్సరం'' ప్రకాశం కుమార్తెలను పరిచయం చేశాడు.

''హలో'' అన్నాడు ముగ్గురితో పలకరింపుగా. శాంతమ్మ వచ్చాక పెద్దలు మాటల్లో పడిపోయారు. ప్రకాశం ముగ్గురమ్మాయిలూ బాలు గదిలో కూర్చుని మాట్లాడుకోసాగారు.

''బాలూ. ఇంటర్‌లో నీది ఏ గ్రూపు?'' సుప్రజ అడిగింది.

''ఎం.పి.సి.''

''మరి ఇంజనీరింగ్‌లో సీటు రాలేదా?''

''వచ్చింది. ఎంసెట్‌లో నాలుగువేల లోపే ర్యాంకు వచ్చింది. అయితే అమ్మ చదివించలేనంది'' బాధగా అన్నాడు.

జాలిగా అతనివైపు చూశారు ముగ్గురూ. శాంతమ్మ భోజనానికి పిలవడంతో అందరూ లేచారు.

చిత్తూరుకు దగ్గర్లోని కాణిపాకంలో జరిగే మాలతి మరదలి తమ్ముడి పెళ్లికి బెంగుళూరు నుంచి వచ్చారు ప్రకాశం కుటుంబ సభ్యులు. ప్రకాశం శాంతమ్మకు పెదనాన్న కొడుకు. భర్త గుండెపోటుతో మరణిస్తే తనకు వచ్చే ఫ్యామిలీ పెన్షన్‌తో కొడుకును చదివిస్తూంది శాంతమ్మ. చాలా ఏళ్ల తరువాత ప్రకాశం తన ఇంటికి వచ్చినందుకు ఎంతో సంతోషపడింది శాంతమ్మ.

సాయంత్రం కాణిపాకం బయలుదేరుతూ ''నువ్వూ రాకూడదూ మాతోపాటు'' అని బాలుని అడిగాడు ప్రకాశం.

''కారులో ఆరు మంది సరిపోరు. నేను తర్వాత బస్సులో వస్తాను. ఆ పెళ్లికి నేను తప్పకుండా అటెండ్ కావాలి. పెళ్లికూతురి తమ్ముడు నా క్లాస్‌మేట్. నన్ను తప్పకుండా రమ్మని శుభలేఖ ఇచ్చాడు''

''ఫర్వాలేదు. అరగంటలో వెళ్లిపోతాంగా. ఎలాగో సర్దుకుని వెళ్లిపోదాం'' అన్నాడు ప్రకాశం. ఆరుగంటలకు బయలుదేరారు అందరూ. శాంతమ్మ మాత్రం తను రాలేనని ఇంట్లో ఉండిపోయింది.

''ముందు గుడికెళ్లి తర్వాత కల్యాణమండపానికి వెళదాం'' అంది మాలతి.

''అదే మంచిది. ఈ సమయంలో రష్ అంతగా ఉండరు'' అన్నాడు బాలు. బాలు అన్నట్లే కాణిపాకం వినాయకస్వామి దర్శనం సులభంగా అయింది. కల్యాణమంటపానికి వెళ్లాక ప్రకాశం ఫ్యామిలీ తమ బంధువులతో, బాలు తన స్నేహితులతో బిజీ అయ్యారు.

పెళ్లికి విపరీతంగా జనం రావడంతో భోజనాల హాలు దగ్గర ఇబ్బంది కలిగింది ప్రకాశం కుటుంబానికి. బాలు తన స్నేహితుల సహాయంతో కొన్ని సీట్లు అట్టిపెట్టుకుని వాళ్లకు ఇవ్వడంతో వారి సమస్య తీరింది.

భోజనాలయ్యాక ప్రకాశం బాలుని పిలిచి ''బాలూ, చిత్తూరులో మాకు మంచి హోటల్ చూపించు. రెండు ఎ.సి. గదులు కావాలి'' అన్నాడు.

''ఎవరికి?''

''మాకే''

''హోటల్ ఎందుకు మామయ్య. మా ఇల్లు ఉందిగా''

''రేపు ఉదయం అయిదు గంటలకు ముహూర్తం. కాబట్టి త్వరగా లేవాలా. అంత త్వరగా మిమ్మల్ని లేపి ఇబ్బంది పెట్టాలి. పైగా ఇక్కడ్నుంచి నాకు దారి తెలుసు కనుక మేమే వెళ్లిపోగలం''

''మీ ఇష్టం. టౌన్లో నాకు తెలిసిన మంచి హోటలుంది. అక్కడికి వెళదాం''

రిసెప్షన్‌లో మాట్లాడి రెండు ఏ.సి.రూములు తీసిచ్చాడు బాలు.


గదిలో కూర్చున్నాక ''నాన్నా, మాకు నిద్ర రావడం లేదు. సెకండ్ షోకెళ్దామా?'' అని తండ్రిని అడిగింది శ్రావణి.

''నాకు ఓపిక లేదమ్మా. బాలు వచ్చే పక్షంలో మీరు ముగ్గురూ వెళ్లి రండి''

''ఏం బాలూ. నీకేమైనా పనులున్నాయా?'' శ్రావణి బాలుని అడిగింది.

''ఏం లేవు. ఇంతకూ ఏ సినిమాకెళ్దాం?'' అన్నాడు బాలు.

నలుగురూ చర్చించుకుని ఏ సినిమాకెళ్లాలో నిర్ణయించుకున్నారు.



''బాలూ. ఈ ఊరిలో సెకండ్ షోకెళ్తే ఇబ్బందులేవీ ఉండవు కదా?'' ప్రకాశం అనుమానంగా అడిగాడు.

''ఏవీ ఉండవు. ఉంటే నేను పిలుచుకెళతానా? మీరు నిశ్చింతగా ఉండండి. మేము బయలుదేరుతాం.''

నలుగురూ రోడ్డుమీదికొచ్చాక ''ఉండండి. అమ్మకు ఫోన్ చేసి వస్తాను'' అంటూ బాలు ఎస్.టి.డి. బూత్ వైపు నడవబోయాడు.

''ఎందుకు బాలూ. నా సెల్ నుంచి మాట్లాడు'' అంటూ సుప్రజ తన సెల్ అందించింది.

బాలు తమ పక్కింటికి ఫోన్ చేసి తల్లిని పిలిపించి ఆమెతో విషయం చెప్పి అనుమతి తీసుకున్నాడు బాలు.

హాల్లో సుప్రజ బాలు పక్కన కూర్చుని అతనితో మాట్లాడుతూంటే అతనికి థ్రిల్లింగ్‌గా ఉంది. ఆడవాళ్లతో పరిచయాలు లేని అతనికి ముగ్గురు అప్సరసల్లాంటి అమ్మాయిలు స్నేహంగా మాట్లాడటం, కలిసి వాళ్లతో సినిమా చూడటం మధురమైన అనుభూతినిచ్చింది.

సినిమా వదిలాక వాళ్లను హోటల్‌లో వదలి ఇంటికి బయలుదేరాడు బాలు.

★ ★ ★

''మామయ్య వాళ్లు రేపు ఉదయం పెళ్లి చూసుకుని నేరుగా మన ఇంటికి వచ్చి ఓ పావుగంట మన ఇంట్లో గడిపి బెంగుళూరు వెళ్లిపోతారట'' తలుపు తెరచిన తల్లితో అన్నాడు బాలు.

''రాక రాక వచ్చారు వాళ్లు. వాళ్లకు తాంబూలంతో బట్టలు పెట్టి ఇస్తే బాగుంటుంది. కానీ సమయానికి చేతిలో డబ్బులు లేవు'' విచారంగా అంది శాంతమ్మ.

''మురుగేశన్ అని నాకు తెలిసినతను బట్టల వ్యాపారం చేస్తూంటాడు. చాలాసార్లు తన దగ్గర బట్టలు కొనమని, వాయిదాల పద్ధతిలో తీర్చవచ్చని చెప్పేవాడు. రేపు పెందలాడే అతని దగ్గరకు వెళదాం.''

''అంత పెందలాడే అప్పు ఇస్తాడా?''

''ఇస్తాడులే. మామయ్య పిల్లలకు కూడా కొందామా?''

''కొనవచ్చు కానీ మళ్లీ తీర్చాలి కదా''

''నా ట్యూషన్ డబ్బుల్తో తీరుస్తాలే అమ్మా. ఎన్నో ఏళ్ల తర్వాత బంధువులంటూ మన ఇంటికి వచ్చారు. వాళ్లకు ఆ మాత్రమైనా చెయ్యక పోతే బాగుండదు.''

మరుసటి రోజు ఉదయం ఆరుగంటలకు మురుగేశన్ ఇంటికెళ్లి బట్టలు కొన్నారు తల్లీకొడుకులు. ఎనిమిది గంటలకు మిల్క్ డైరీ నుంచి బాసుంది, పాలకోవా తెచ్చాడు బాలు.

ప్రకాశం కుటుంబం బాసుంది, పాలకోవా తిని చాలా బాగుందని మెచ్చుకున్నారు.

''ఇవి చిత్తూరు స్పెషల్ ఐటమ్స్'' అన్నాడు బాలు.

పది గంటలకు బెంగుళూరుకు బయలుదేరి వెళ్లారు ప్రకాశం, అతని కుటుంబ సభ్యులు.

''మీ మామయ్య ఫిలిం డిస్ట్రిబ్యూషన్‌లో బాగా సంపాదించాడు. అయితే ఎప్పుడూ ఎవరికీ సహాయపడగా నేను చూడలేదు. స్వార్థమని అనను గానీ చాలా జాగ్రత్తపరుడు'' అంది శాంతమ్మ కొడుకుతో వాళ్లు వెళ్లిపోయాక.

''వాళ్ల ముందు ఎంతో చిన్నతనంగా ఫీలయ్యాను. మన ఇల్లూ, మన దుస్తులు పోల్చుకుని.''

''అలా ఎప్పుడూ ఫీలవ్వకు బాలూ. మనం ఎంత కష్టంతో జీవనం సాగిస్తున్నాం. అయితే ఎవరి దగ్గరా యాచించకుండా బ్రతకగలుగుతున్నాం. అంతకంటే ఏం కావాలి? డబ్బు విషయంలో ఎప్పుడూ మన కంటే కింది స్థాయి వాడితో పోల్చుకోవాలి. అప్పుడే జీవితంలో తృప్తి, ఆనందం ఉంటుంది.''

నిజమేనన్నట్టు తలూపాడు బాలు.

★ ★ ★

ఉదయం నాలుగు గంటల బస్సులో బయలుదేరి ఎనిమిది గంటలకు బెంగుళూరు బస్టాండు చేరుకున్నాడు బాలు. అక్కడ్నుంచి ఆటోలో

మ్యారేజ్ హాల్ చేరుకున్నాడు. హాలు నిండా మనుషులే. తెలిసిన మనిషి ఒక్కరూ కనిపించలేదు అతనికి. ''ముందు ముఖం కడుక్కుని దుస్తులు మార్చుకోవాలి'' అనుకుంటున్న అతనికి ఒక లావుపాటావిడతో మాట్లాడుతున్న సుప్రజ కనిపించింది. ఆమెను చూడగానే అతని ముఖం ఆనందంతో విప్పారింది.

దగ్గరకెళ్లి ''హాయ్ సుప్రజా'' అన్నాడు.

ఆమె తలెత్తి చూసి ''హాయ్'' అని మళ్లీ ఆ లావుపాటావిడతో మాట్లాడసాగింది.

బాలు చాలా నిరుత్సాహంగా ఫీలయ్యాడు. 'చిత్తూరులో అంత ఆప్యాయంగా తనతో మాట్లాడిన సుప్రజేనా ఈమె?' అనుకున్నాడు. ఆమె మాట్లాడటం అయ్యాక ''సుప్రజా. నేను గుర్తున్నానా? బాలుని'' అన్నాడు.

ఆమె గుర్తున్నావన్నట్లు కళ్లతోనే సంజ్ఞ చేసి వెళ్లిపోయింది.

తల తీసేసినట్టయింది అతనికి. కళ్లలో నీళ్లు వచ్చాయి. ఎవరిని చూడాలని ఆశతో వచ్చాడో ఆమె నిర్లక్ష్యం అతనికెంతో బాధించింది. నీరసంగా నడుస్తూ గదులున్నవైపు నడిచాడు. అక్కడ ఓ గదిలోంచి బయటకొచ్చిన భార్గవి కనబడింది. ఆమెను చూసి నవ్వాడు బాలు. ఆమె కూడా అతనివైపు చూసి నవ్వి వెళ్లిపోయింది. వాళ్లు తనను చూడగానే ఆనందంగా రిసీవ్ చేసుకుంటారని, 'అమ్మ రాలేదా' అని అడుగుతారని ఆశించాడు. తన ఆశ నిరాశే అయింది అనుకున్నాడు.

గదులన్నీ చూసుకుంటూ వెళుతూంటే ఓ గది కాస్త ఖాళీగా కనిపించింది. ఆ గదిలో కుర్చీలో కూర్చున్న ముసలావిడను చూడగానే ఎంతో ధైర్యం వచ్చింది అతనికి. ఆవిడ శాంతమ్మకు పినతల్లి. ఆవిడ దగ్గరకు వెళ్లి ''అవ్వా. బాగున్నావా?'' అని అడిగాడు.

''నువ్వు...'' గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అంది ఆవిడ.

''చిత్తూరులోని శాంతమ్మ కొడుకుని. నా పేరు బాలు.''

శాంతమ్మ పేరు వినగానే ఆమె ముఖం ఆనందంతో విప్పారింది.

''బాలు శాంత కొడుకా నువ్వు. చాలా పెద్దవాడయిపోయావు నాయనా'' అంటూ ఆప్యాయంగా పలుకరించింది. కొంతసేపు మాట్లాడుకున్నాక-

''అవ్వా. నేను ముఖం కడుక్కోవాలి'' అన్నాడు.

''అదిగో బాత్‌రూమ్ ఖాళీగానే ఉంది. వెళ్లు నాయనా'' అంది.

ముఖం కడుక్కుని బయటికి వచ్చి దుస్తులు మార్చుకున్నాడు. తర్వాత ప్రకాశం కోసం చూస్తూ ముందుకు కదిలాడు.

వేదికపై మాంగల్యధారణ జరుగుతోంది. ప్రకాశం కుటుంబ సభ్యులందరూ వేదికపైనే కనిపించారు. బాలు వేదిక పక్కనే నిలబడి శ్రావణిని చూడసాగాడు. పెళ్లికూతురి అలంకరణలో చాలా అందంగా ఉంది శ్రావణి. అందరూ బహుమతులు చదివిస్తూంటే అతనూ వెళ్లి క్యూలో నిలుచుని బహుమతి ఆమె చేతికిచ్చాడు. శ్రావణి అందుకుని అతనివైపు చూసి నవ్వి వెనుకనున్న అమ్మాయి చేతికి బహుమతిని అందించింది. బాలుని చూసి 'వచ్చావా?' అని గాని 'అమ్మ బాగుందా'? అని గాని అడగలేదు. ''శ్రావణికి ఈ రంగు చీర బాగా ఒప్పుతుంది. నేను సెలక్ట్ చేసి మరీ ఇచ్చానని శ్రావణితో చెప్పు'' అన్న తల్లి మాటలు గుర్తొచ్చాయి అతనికి.

''అమ్మో. ఇక్కడికి వచ్చినవాళ్లకే ఓ మర్యాద, గుర్తింపు లేదు. ఇక రానివాళ్ల గురించి పట్టించుకునే తీరిక వీరికెక్కడిది?'' అనుకున్నాడు.

బాలు ప్రకాశంతో మాట్లాడాలని ప్రయత్నించాను గానీ అతను సన్నిహితుల అభినందల్ని అందుకుంటూ బిజీగా ఉన్నాడు. అక్కడ్నుంచి కదలి దూరంగా ఓ కుర్చీ లాక్కుని కూర్చోబోయాడు. ఇంతలో ''ఆగు'' అన్న పిలుపు వినిపించి ఆశ్చర్యంగా చూశాడు.

ఎదురుగా ఓ యాభై ఏళ్ల వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతన్ని గదిలో చూసినట్లు గుర్తొచ్చింది బాలుకు.

''ఎవరు నువ్వు?'' తీక్షణంగా బాలును చూస్తూ అడిగాడు.

''నేను...నేను...'' ఏం చెప్పాలో తోచలేదు బాలుకు.

''ఆ గదిలోకి ఎందుకు వెళ్లావు నువ్వు?''

''ముఖం కడుక్కుని బట్టలు మార్చుకోవడానికి''

''గదిలో ఎవడంటే వాడు దూరడమేనా? మర్యాదగా చెప్పు పెట్టెలోని డబ్బు నువ్వు తీశావు కదూ?''

''నేనా? లేదండి. నాకేం తెలియదు''

''నువ్వు ఊరికే ఇలా అడిగితే ఎలా చెబుతావు? నాలుగు తంతే నిజం చెబుతావు.''

పెళ్లికి వచ్చిన వాళ్లందరూ అక్కడ గుమికూడి వినోదం చూడసాగారు. ప్రకాశం అక్కడకి వచ్చి ''ఏమిటి రాజా?'' అని అడిగాడు. అతను ప్రకాశంతో తన అనుమానం చెబుతున్నాడు. బాలుకు ఎంతో అవమానంగా అనిపించింది. సుప్రజ, భార్గవి ఆశ్చర్యంగా తనవైపే చూడటం కనిపించింది అతనికి.

ప్రకాశం తనకు సపోర్ట్ వస్తాడని, తను అటువంటి మనిషి కాదని చెబుతాడని ఆశించాడు బాలు. అయితే అతను ఏమీ మాట్లాడకుండా బాలువైపే చూస్తున్నాడు.

''ఇంతకూ వీడెవడో నీకు తెలుసా బావా?'' అతను అడుగుతున్నాడు ప్రకాశాన్ని. ప్రకాశం తెలుసన్నట్టు, తెలీదన్నట్టు తల మధ్యస్తంగా ఊపాడు.

ఇంతలో ఓ ఆవిడ వచ్చి ''ఏమండీ. పదండి. చదివింపులయిపోతున్నాయి. మిమ్మల్ని పట్టుకోవడం నా వల్ల కావడం లేదు'' అంది అతనితో.

''ఉండవే. చదివింపులకు ఉంచిన డబ్బులు పోయి నేనేడుస్తూంటే మధ్యలో నీ గోల ఒకటి.''

''ఆ డబ్బులు నేను తీసుకెళ్లానండీ. ఆ మాట మీతో చెప్పాను కదా''

అతని ముఖం నల్లగా మారింది అవమానంతో.

''భలేవాడివి రాజారావు. పాపం అనవసరంగా ఆ కుర్రాణ్ని అనుమానించావు'' అందరూ అన్నారు అతనితో.

బాలు బయటకు నడుస్తూంటే ''ఆగరా బాలూ. ఆయన పొరబాటు పడ్డారు. ఏమనుకోకు'' అన్నాడు ప్రకాశం.

''పొరబాటు నాది మామయ్యా. శుభలేఖ అందగానే పరుగెత్తుకొని వచ్చాను చూడండి. అది నా పొరబాటు. చిత్తూరులో మీరు చూపించినది నిజమైన ప్రేమ అని భ్రమించి వచ్చాను. అక్కడ ఓ విడిది. అన్నీ చూపించడానికి ఓ మనిషి అవసరం కనుక మా ఇంటికి వచ్చి మాతో అభిమానం నటించారని, నన్నూ, మా అమ్మనూ కరివేపాకులా వాడుకుని పారేశారని ఇప్పుడర్థమైంది నాకు'' అంటూ కదిలాడు.

''భోజనం చేసి వెళ్లరా'' ప్రకాశం అన్నాడు.

''కడుపు నిండిపోయింది మామయ్యా. నా మనుషుల్ని చూడబోతున్నానన్న ఆనందంతో ఆశతో వచ్చిన నాకు మీరు మీ కూతుర్లు నన్ను రిసీవ్ చేసుకున్న తీరు చూశాక భోజనం చెయ్యాలని అనిపించడం లేదు మామయ్యా. మీకో సలహా చెబుతాను. ఏమనుకున్నా సరే''

ఏమిటన్నట్టు చూశాడు ప్రకాశం.

''భార్గవి, సుప్రజ పెళ్లిళ్లప్పుడు రెండు రకాలుగా శుభలేఖలు వేయించండి. ఇప్పుడు మాకు పంపావు చూడు 'కుటుంబ సమేతంగా వచ్చి వధూవరులను ఆశీర్వదించి మమ్మల్ని ఆనందింపజేయ ప్రార్థన' అని. అటువంటి కార్డులు మీకు ఇష్టమైన వాళ్లకు, మీ అంతస్థుకు తగిన వాళ్లకు పంపండి. ఇంకో రకం కార్డుల్లో 'ఇది మీ ఇన్ఫర్మేషన్ కోసం మాత్రమే సుమా' అన్నట్లు ఆహ్వానం లేకుండా వేయించి మాలాంటి వాళ్లకు పంపండి. నాలా అభిమానంగా వచ్చి భంగపడే ఇబ్బంది కొంతమందికైనా తప్పుతుంది.''

కన్నీళ్లతో కదులుతున్న బాలును చూసిన అందరి గుండెలూ బరువెక్కాయి. ప్రకాశం, భార్గవి, సుప్రజ ముఖాల్లో తప్పుచేసిన భావన కనిపించింది.